
## సంక్రాంతి కథల పోటీలో రూ. 1000/- రెండవ బహుమతి పొందిన కథ

*లోకం ప్రయోజకత్వంగా చెప్పుకునే గుణాలు నిజంగా ప్రయోజనం వున్నవేనా?*

**తీరిగ్గా కూర్చుని వీక్లీ చదువుతున్న దాసు సిక్స్‌త్ సెన్స్‌కి ఆ గదిలో ఇంకో మనిషి కూడా ఉన్నట్లు అనిపించింది.**

తలెత్తి చూసేసరికి వాసన్ నిలబడి ఉన్నాడు. చాపకిందికి నీళ్ళలాగా నిశ్శబ్దంగా వస్తాడు అతను. కాళ్ళకి దిండ్లు కట్టుకున్నట్లు చప్పుడు కాకుండా నడుస్తాడు. తలుపుతట్టి లోపలి రావాలనే తలపు అతనికి తట్టదు వచ్చినవాడు పలకరించకుండా అలా నిలబడి, పట్టుబడిపోయిన దొంగని చూసినట్లు చూస్తూ ఉంటాడు.



"రండి!" అన్నాడు దాసు అతి మర్యాదగా.

వాసన్ అమర్యాదగా దాసునీ, అతని చేతిలోని తెలుగు వారపత్రికనీ చూశాడు.

"ఇది చదువుతున్నారా?" అన్నాడు. అతని పెదిమలమీద పరిహాసం.

చెయ్యకూడని పని చేస్తూ దొరికిపోయిన వాడిలాగా చూశాడు దాసు. వాసన్ అనబోయేది అతనికి తెలుసు.

"తెలుగు మేగజైన్లు ఉత్త ట్రాష్ అండీ! టామిల్‌లో అయితే...."

వాసన్ తెలుగువాడే! అతని అసలు పేరు వాసుదేవరావు. అతను మెడ్రాసులో పెరిగాడుట. "కొంచెం తమిళ వాసన రావాలని వాసన్ అని మార్చేశాను పేరు. దీనివల్ల చాలా లాభాలున్నాయిలెండి." అని అంటుంటాడు నవ్వుతూ. అతని పెదిమల మీద అదో రకమైన వంకర నవ్వు ప్రతి వాక్యానికీ ముందూ తర్వాతా ప్రెసిడెంటు కారుకి ముందు పైలట్టూ, వెనక ఎస్కార్టు లాగా కనబడుతూ వుంటుంది. అతని మొహం మీద "వీడు ప్రయోజకుడు" అన్న స్టాంపు గుద్దినట్లు కనబడిపోతూ వుంటుంది. అతను నలుపే అయినా ఏదో తేజస్సుతో వెలిగిపోతున్నట్లు వుంటాడు విపరీతమైన ఆత్మ విశ్వాసంతో రొమ్ము విరుచుకు నడుస్తూ. "నే నొక్కణ్ణే పురుషుణ్ణి మీరందరూ పురుగులు" అన్నట్లు వెక్కిరింపుగా చూస్తుంటాడు.

"ఆ పుస్తకం అక్కడ పడేసి లేవండి! ఏదన్నా మార్నింగ్ షోకి వెళదాం!" అన్నాడు వాసన్.

"ఏ సినిమా?"

"మీరే చెప్పండి" అన్నాడు వాసన్. నవ్వు ఆపుకుంటూ, అతను చెప్పబోయేది తనకి తెలుసు నన్నట్లు.

ఏదో తెలుగు సినిమా పేరు చెప్పాడు దాసు మామూలుగా

వాసన్ వెంటనే పూనకం వచ్చిన వాడిలా వూగిపోతూ "ఏం టేస్టండీ మీది! సంధ్యాలో కొత్త పిక్చరు రిలీజయింది. అది టామిల్‌లోనుంచి తెలుగులోకి కాపీ! తెలుగులో ఎలా యేడ్చిందో తెలీదుగానీ టామిల్‌లో సుపర్బ! అది చూద్దాం! పదండి!" అన్నాడు దాసుని వెంగళప్పని చూసినట్లు చూస్తూ.

దాసు ఒంటెలాగా వెర్రినవ్వునవ్వుతూ బయలుదేరాడు.

వాళ్ళు రోడ్డుమీద అడుగు పెట్టగానే, ఇంటి యజమాని తన బంగళాలోకి వెళ్ళబోతూ కనబడ్డాడు.

ఆ కాంపౌండులో అర డజను కుటుంబాలు ఉన్నాయి. కాందిశీకుల్లాగా బిక్కుబిక్కుమంటూ బతికే జనాలే వాళ్ళందరూ! యజమాని ఇల్లు ఖాళీచెయ్యమంటాడేమో. అద్దె పెంచమంటాడేమో. లేదా మరేదన్నా

# అప్రయోజకుడు

మైనంపాటి భాస్కర్



దుర్వార్త చెబుతాడేమో అని గజగజలాడుతూ, అతను కనబడని రోజున పండగగా భావిస్తుంటారు వాళ్లు.

నెల రోజుల క్రితం, ఆ బిక్కజీవాల మధ్య ఊరకుక్కల మధ్య సీమకుక్కలా. కాకుల మధ్య డేగలా చేరాడు వాసన్.

యజమాని కనబడగానే, "ఏమండోయ్ రాఘవులుగారూ! ఎలా వుంది మీ బిజినెస్?" అంటూ ధిలాసాగా పలకరించాడు.

అతని ధైర్యానికి దిగ్భ్రమ చెంది నిలబడిపోయాడు దాసు. పుట్టలోకి వెళ్ళిపోతున్న పాముని చూసి పక్కగా తప్పుకోకుండా "హలో! బావున్నావా? కప్పలు బాగా దొరుకుతున్నాయా?" అని పలకరిస్తాడా ఏ మొనగాడన్నా?

"మా యింటికి సున్నమూ, పాడూ వేయించరా ఏమిటి?" అని చనువుగా దబాయిస్తున్నాడు వాసన్. ఇంటి యజమాని మొహం వెల్లవేసినట్లు తెల్లబడిపోయింది. "సరే! సరే" అంటూ గబగబ వెళ్ళిపోయాడు.

"వీడికి బిజినెస్సువుంది. నేనేమో మరి కమర్షియల్ టాక్సెస్ ఆఫీసులో పని చేస్తున్నాను. కయ్ కయ్ అన్నాడంటే 'రూళ్ళ' కర్రలతో కాళ్ళు విరక్కొట్టెయ్యగలను. భయపడక చస్తాడా మరి!" అని విశదీకరించాడు వాసన్ దారిలో.

సర్కస్‌లో పులుల్ని ఆడించేవాడిని ప్రేక్షకులు భయంగా, భక్తిగా చూసినట్లు చూశాడు దాసు

ఎంత ప్రయోజకుడు ఇతను! నలభై కొంపలు ముంచి నాలుగు కొంపలు కట్టిన అతి ప్రయోజకుడు రాఘవుల్నే బెదరగొట్టేశాడు!

వెంటనే తను ఎలాంటివాడో గుర్తొచ్చింది దాసుకి. తను ఉత్త అప్రయోజకుడు! పరమ చవట!

తను ఎందుకూ పనికి రానివాడని బంధువు లందరిలో చిన్నప్పటినుంచీ ప్రతీతి! మబ్బుగా డల్‌గా వుంటాడుట తను. ఏ పనీ ఎప్పుడూ సక్రమంగా. ప్రజ్ఞగా చేసినట్లుగానీ చెయ్యగలిగినట్లుగానీ దాఖలా లేదుట!

అలాంటి తనకి, ఇంతటి ఘటికుడయిన వాసన్‌తో స్నేహం ఎలా కుదిరింది?

దాసుకి ఎవరితో స్నేహం చేసుకోవడం కూడా చేతకాదు. నంగిగా మాట్లాడతాడు వాసన్ మాత్రం ఎవరితో నయినా సరే క్షణంలో మాటలు కలిపేసి మత్తుమందు చల్లెయ్యగలడు. ఎదుటివాడివల్ల తనకి పూచిక పుల్లంత లాభం జరగవచ్చని వాసన తగిల్తేచాలు, తక్షణం అతనికి "డియరెస్ట్ ఫ్రెండు" అయిపోతాడు అతను.

నాజమ్మలాంటి దాసుతో అతను 'స్నేహం' చేసుకోవడానికి కారణంవుంది. దాసు మెతకతనంచూసి ముచ్చటపడ్డాడు వాసన్. తన ప్రగల్భాలని విని, తన పరాక్రమాన్ని కని, తన ప్రయోజకత్వాన్ని పొగిడే "తీ ఇన్‌వన్" శ్రోతా,



## పరిచయం

కోస్తా ప్రాంతంలో పుట్టి, రాయలసీమలో పెరిగి, తెలంగాణాలో స్థిరపడినవాడిని నేను. నానాజాతి సమితిలాంటి సికంద్రాబాద్‌లో నివాసం కాబట్టి అన్ని భాషలమీదా, సంస్కృతుల మీదా అభిమానం యేర్పడింది ఈ ఎస్. ఐ. కార్పొరేషన్, హైదరాబాద్ రీజినల్ ఆఫీసులో వుద్యోగం చేస్తున్నాను.


కార్టూన్లతో పత్రికలలో ప్రవేశించాను. కథలూ, నవలలూ రాయడం మొదలెట్టాక బొమ్మలెయ్యడం కుదరటంలేదు. "ఆంధ్రజ్యోతి"లో బహుమతి రావటం ఇది రెండవ సారి. గత సంవత్సరం "తిలోదకాలు" కథకి కన్సొలేషన్ బహుమతి వచ్చింది. ఇంతకు ముందు "ఆంధ్రపత్రిక"లో "ఇంకో సీత కథ"కీ, "ఆంధ్రభూమి"లో "నెగెటివ్" కథకి, "ఆంధ్రప్రభ"లో "మౌనరాగాలు" నవలకి బహుమతులు వచ్చాయి. "తులసిదళం, ప్రేమ తరంగం" అన్న నవలలు ప్రచురితమయ్యాయి.

నా శ్రీమతి విమల కూడా రచయిత్రే. తను రాసిన "మిస్ జ్యోతిర్మయి" నవల పాఠకుల ఆదరణ పొందడమేకాక ప్రస్తుతం సినిమాగా రూపుదిద్దుకొంటోంది.

రేడియో కోసం రాయడం, సినిమా సమీక్షలు చేయడం నా ఇతర వ్యాపకాలు.

నన్ను మొదటినుంచీ ప్రోత్సహించిన వాళ్ళనందరినీ ఈ సందర్భంగా పేరు పేరునా గుర్తుకి తెచ్చుకుంటున్నాను. బహుమతియిచ్చిన "ఆంధ్రజ్యోతి" సంపాదక వర్గానికీ, న్యాయ నిర్ణేతలకూ, హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

—మైనంపాటి భాస్కర్




విజయవాడ కార్టూనిస్టులు నిర్వహించిన మూడవ కార్టూన్ల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కార్టూను.

ప్రేక్షకుడూ. వందిమాగధుడూ దాసు అని గ్రహించాడు.

బస్టాపులో నిలబడ్డారు ఇద్దరూ.

అయస్కాంతం ఇనుప రజనుని ఆకర్షించినట్లు, రెండు ద్వారాలకీ కుప్పగా జనాన్ని అతికించుకుని వచ్చింది బస్సు.

"నెక్స్ట్ బస్సులో వెళదాం!" అన్నాడు దాసు నిరాశగా.

వాసన్ హేళనగా నవ్వి, దాసు చెయ్యి పట్టుకు లాక్కెళ్ళి ద్వారానికి ఎడమవైపు నుంచి దూరిపోయి, దాసుని నెడుతూ ఎక్కించేసి, తనుకూడా ఎక్కాడు. ఈ హడావిడిలో అప్పటికే సగం ఎక్కిన ఒకతను బాలెన్స్ తప్పి కిందికి దిగిపోయాడు.

బస్సు కదిలింది.

విజయగర్వంతో దాసుని చూశాడు వాసన్. "అదీ నేర్పు అంటే! బస్సు నానుకుని నిల్చుని యెడం చేతి వైపునుంచీ బలంగా తోసుకుంటూ ఎక్కెయ్యాలి! ఎంతజనం వున్నా దూరిపోవచ్చు!"

దాసు మెప్పుదలగా చూశాడు.

అసలు ఇతను మామూలు మనిషేనా? లేకపోతే దైవాంశ సంభూతుడా? ఎంత చాకచక్యంగా చేస్తాడు ప్రతి పని!

ఇతను తనని స్నేహితుడుగా అంగీకరించడం—కేవలం తన అదృష్టమే!

ఇతనితో స్నేహం వలన కొన్నాళ్ళకి తనకి కూడా కొంచెంగానన్నా ప్రయోజకత్వం అబ్బుతుందేమో!

"హలో!" అంటూ ఎవర్నో పలకరించాడు వాసన్.

అతను వెనక్కి తిరిగి చూసి నవ్వి "బావున్నారా?" అన్నాడు.

"ఏదో యిలా ఏడుస్తున్నాం!" అన్నాడు వాసన్ హాస్యంగా "మీరింకా యూడీసీగానే కొట్టుకుంటున్నారా? అసలు మనవాళ్ళ ప్రమోషన్ పాలసీ ఛండాలమండీ! ఒక రూలూ లేదు. రైమూ లేదు...."

"నాకు ప్రమోషనొచ్చిందండీ!" అన్నాడతను ఉత్సాహంగా. "ఆఫీసు బిల్డింగుకి కేర్ టేకర్‌గా వేశారు."

వెంటనే వాసన్ మొహం నల్లబడిపోయింది. అతని మొహంలో జెలసీ చోటు చేసుకుంది. అంతలోనే పుంజుకుని "అంటే యికనుంచీ లెట్రిన్లూ, బాత్ రూంలూ కడిగించే హెడ్ స్వీపర్ అన్నమాట మీరు? ఎక్కడికి? చీపుళ్ళు కొనడానికి వెళుతున్నారా?" అన్నాడు జోక్ లాగా నవ్వేస్తూ.

అవతలి మనిషి ఇబ్బందిగా నవ్వాడు.

కండక్టరు "టిక్కెట్, టిక్కెట్" అంటూ ఆ జనంలో తోసుకుంటూ వీళ్ళ దగ్గరికి వచ్చేసరికి నాలుగు స్టాపులు దాటిపోయాయి.

"రెండు సంగం" అన్నాడు వాసన్, డబ్బులు తియ్యకుండానే.

"ఎక్కడనుంచి సార్?"

దాసు ఏదో చెప్పబోయేలోపల "ఇక్కడినుంచే!" అన్నాడు వాసన్ సునాయాసంగా అబద్ధం ఆడేస్తూ.

టిక్కెట్లకి డబ్బులు దాసు ఇచ్చాడు.

థియేటర్ దగరికి వెళ్ళివెళ్ళగానే అరక్షణంలో అక్కడి పరిస్థితి ఆకళింపు చేసేసుకున్నాడు వాసన్. అతనివి డేగకళ్ళు! బుక్కింగ్ క్లోజయిపోయింది. ఒకతను అయిదారు టిక్కెట్లు చేతిలో వుంచుకుని గేటుకి దూరంగా నిలబడి బ్లాక్‌లో అమ్ముతున్నాడు.

"డబ్బులిలాతే!" అంటూ దాసు దగ్గర నోట్లు గుంజుకుని మాయమయ్యాడు వాసన్.

అతను బ్లాక్ మార్కెటీర్ దగ్గరికి వెళ్ళలేదు. బుక్కింగు దగ్గరికి వెళ్ళలేదు. మరి ఎక్కడికి వెళ్ళాడో అర్థం కాలేదు దాసుకి.

రెండు నిమిషాల తర్వాత నాలుగు టిక్కెట్లు పట్టుకుని వాలాడు అతను.

సంభ్రమంగా చూస్తూ, "ఎక్కడివి?" అన్నాడు దాసు.

"అతనెవరో టిక్కెట్లు రిజర్వు చేయించుకున్నాడుట! వాళ్ళ ఫ్రెండ్సు రాలేదని తిరిగెళ్ళిపోతూ టిక్కెట్లు యెవరికో యిచ్చెయ్యబోతుంటే నేను అడ్డంపడి లాక్కొచ్చాను."

"వాసన్‌కి అద్భుత శక్తులున్నాయేమో!" అనిపించింది దాసుకి. అతనెవరో టిక్కెట్లు యిచ్చెయ్యబోతున్నట్లు యితనెలా పసికట్టేశాడు?

"ఎక్కడైనా నెగ్గుకు రాగలరు మీరు! అది సరే! మనం యిద్దరమేకదా! నాలుగు టిక్కెట్లు తెచ్చారెందుకు?"

ఎందుకో మరో నిమిషంలో తెలిసింది. ఎక్స్‌ట్రాగా వున్న రెండు టిక్కెట్లూ లాభానికి బ్లాక్‌లో అమ్మేశాడు వాసన్.

సినిమా చూశాక ఉత్తేజితుడైపోయాడు అతను. "ఏం కేశాడండీ డైరెక్టరు! సంఘంలో జరుగుతున్న దురన్యాయాలనీ, ఘరానా పెద్దమనుషులుగా చెలామణీఅయ్యే బ్లాక్‌మార్కెట్‌గాళ్ళనీ దుమ్ము దులిపేశాడు! ఈయన పిక్చర్లని తప్పనిసరిగా ప్రతివెధవా చూసేటట్లుచెయ్యాలి. అప్పుడుగానీ మారదీ చెత్త సొసైటీ!" అన్నాడు ఆవేశంగా. అంతేకాదు "అసలు ఇట్లాంటి డైరెక్టర్లు తెలుగులో లేరండీ! ఆ మాటకొస్తే హోల్ ఇండియాలోనే— వెధవ ఇండియా ఏమిటి, ప్రపంచంలో ఏ దేశంలోనూ లేరు! టామిల్‌లో తప్ప!" అని కూడా అన్నాడు.

వాసన్‌కి టామిల్ తప్ప మరేభాషా సరిగా రాదు తనకు తెలిసిందే గొప్ప అని వాదించేరకం అతను. అతను అస్సాంలో పెరిగి వుంటే 'అస్సామిదె దేవభాష' అని వాదించి వుండేవాడు. వాదించడమే కాదు, బోధించి, బాధించి, నిన్ను దించి, తనపైకి ఎక్కెయ్యగలడు! మాటకారి అతను.

సినిమానుంచి హోటలుకి వెళ్ళారు.

టిఫిను ఆర్డరిచ్చే శ్రమ తను తీసుకుని, బిల్లు చెల్లించే భాగ్యం మాత్రం దాసుకి కలగజేశాడు వాసన్. అక్కడనుంచి రైల్వేస్టేషన్‌కి వెళ్ళాలన్నాడు

"ఎందుకు?" అన్నాడు దాసు.

"ఆరో తారీఖున మహాబలిపురం వెళుతున్నాం! ఎల్టీసి తీసుకుని!" అన్నాడు గొప్పగా.

"ఓహోహో! వెరీ గుడ్!" అన్నాడు దాసు సంతోషం ప్రకటిస్తూ.

"మీరు కిందటి సంవత్సరం హంపీ వెళ్ళారు కదూ? ఏముందండీ హంపీలో? రాళ్ళూ రప్పలూ తప్ప! మహాబలిపురంలో అయితే...."

స్టేషన్‌లో రిజర్వేషన్ కౌంటర్ దగ్గర నిలబడ్డాడు వాసన్. క్యూ జరగకుండానే తను మాత్రం ముందుకి జరిగిపోతూ, రెండు నిమిషాల్లో క్యూలో రెండోవాడయిపోయాడు. అతని ముందు నిల్చున్నవాడు బుక్కింగ్ క్లార్కుతో ఘర్షణపడుతున్నాడు. వెంటనే వాసన్ చెలరేగిపోయి ఆ క్లార్కు తరపున వకాల్తా పుచ్చుకున్నట్లు, తన ముందు నిలబడ్డవాడికి గడ్డి పెడుతూ గట్టిగా మాట్లాడ్డం మొదలెట్టాడు."

తర్వాత వాసన్ వంతు వచ్చింది. "రెండు ఫుల్, రెండు హాఫ్ టిక్కెట్లు సార్!" అంటూ రెండు వంద రూపాయల నోట్లు అందించాడు.

క్లార్కు నొచ్చుకుంటూ చూశాడు.

"ఆరో తారీఖా? సారీ! లేవండీ! కోటా పూరయిపోయింది" అన్నాడు డబ్బులు తిరిగి యిచ్చేస్తూ.

"ఎలాగోలా చూడండి సార్!" అన్నాడు వాసన్. గొంతులో అతి స్నేహం, అతి దైన్యం, అతి మంచితనం పలికిస్తూ.

అప్పటిదాకా తనని సమర్థిస్తూ మాట్లాడిన మనిషిని నిరుత్సాహపరచలేక పోతున్నాడు క్లార్కు. మార్గం అన్వేషిస్తూ రిజిష్టర్లు తిరగేస్తున్నాడు.

అంతసేపూ అనర్గళంగా ఏదేదో చెబుతున్నాడు వాసన్. తల్లికి జబ్బు. ఆఫీసులో సెలవు, అత్యవసరం....అదీ ఇదీ....

"సరే సార్! ఏదో అడ్జస్ట్‌చేసి యిస్తున్నాను" అంటూ రిజిష్టర్‌లో రాసుకుని టిక్కెట్లు యిచ్చాడు క్లార్కు.

బయటికి రాగానే అతన్ని హీరోని చూసినట్లు ఆరాధనగా చూశాడు దాసు.

"టిక్కెట్లు లేవని చెబుతున్నా సాధించుకొచ్చారే మీరు! అదే నేనయితేనా! మెడ పట్టుకు గెంటేసి వుండేవాళ్ళు."

అతని పొగడ్తలు తనివితీరా విన్నాడు వాసన్. విని, "అసలు విశేషం వేరే ఉంది" అంటూ జేబులో నుంచి రెండు వంద రూపాయల నోట్లు తీశాడు.

ప్రశ్నార్థకంగా చూశాడు దాసు.

"వెర్రి పీనుగ! మాటల్లోపెట్టి ఊదరగొట్టేసరికి తికమకపడిపోయి, నాకు తిరిగి ఇచ్చేసిన నోట్లు మళ్ళీ తీసుకోకుండానే టిక్కెట్లు ఇచ్చేసి, పైగా దక్షిణలాగా చిల్లర కూడా ఇచ్చాడు. ఎట్లా సెలెక్టవుతారో ఏమో, ఇట్లాంటి సరుకంతా!"

"తిరిగి ఇచ్చెయ్యలేదా డబ్బు?"

"ఏమిటీ? తిరిగి ఇచ్చెయ్యాలా!" అంటూ వెర్రిగొర్రెను చూసినట్లు చూశాడు వాసన్

"పొరబాటు చేసిందివాడు! మన తప్పేం లేదు! ఒకటికి రెండుసార్లు యిట్లా జరిగితేగానీ వెధవలు వళ్ళు దగ్గర పెట్టుకుని పని చెయ్యరు."

ఇదిమాత్రం దారుణంగా కనబడింది దాసుకి. అన్యమనస్కంగా అయిపోయాడు.


## ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోన్ : 395126

**SUPREME CORPORATION (BANKERS)**

-15, "EVEREST" 7th Floor, Near Famous cine laboratory, Tardeo Road, BOMBAY-400 034.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో



## ప్రతి హృదయములోను, ప్రతి సదనములో సాహితీ జ్యోతులు వెలిగించు "డీలక్స్" ప్రచురణలు

### మాదిరెడ్డి సులోచన

| | |
|---|---|
| ఎంత ఘాటు ప్రేమయో | 12-50 |
| బిందుపథం | 12-50 |
| ఎదగని మనసులు | 10—00 |
| శ్రీమంతులు | 10—00 |
| రవిచంద్ర | 10—00 |
| సుషుప్తి | 10—00 |

### ఆర్. సంధ్యాదేవి

| | |
|---|---|
| ప్రేమమకుటం | 15-00 |
| హరిచందనం | 15-00 |
| మువ్వలమురళి | 14-00 |

### కావలిపాటి విజయలక్ష్మి

| | |
|---|---|
| రత్నపరాజయం | 11—00 |
| అగ్రహారం | 10—00 |

### గోపీచంద్

| | |
|---|---|
| ప.ప. శాస్త్రి వీలునామా | 15—00 |
| యమపాశం | 12—50 |
| అసమర్థుని జీవయాత్ర | 10—00 |

### మల్లాది వెంకటకృష్ణమూర్తి

| | |
|---|---|
| స్రవంతి | 12—00 |
| బలికోరిన వజ్రాలు | 10—00 |
| బ్రతుకు భయం | 8—00 |
| మిసెస్ పరాంకుశం | 8—00 |
| పడమట సంధ్యారాగం | 10—00 |

### వాసిరెడ్డి సీతాదేవి

| | |
|---|---|
| రాబందులూ-రామచిలుకలూ | 10—00 |
| అపరాజిత గొలుసు నవల | 11—00 |

## డీలక్స్ పబ్లికేషన్స్

ఏలూరు రోడ్ * విజయవాడ-520002

# సూర్యుడు తప్పిపోయాడు

ఆకాశమాత పెద్దకొడుకు
అనాదియైన కాలంతో పుట్టినవాడు
ప్రతిదినం వెలుగిచ్చేవాడు
చిరంజీవి లోక బాంధవుడు
తప్పిపోయాడు నాలుగైదు రోజుల్నించీ
కన్ను పొడుచుకొన్నా కానరావటంలేదు

నీవు వెళ్ళగానే—
నల్లేరు మీద బండిలా నడిచిన
ఈ విశ్వ కుటుంబం కుంటినడక
నడుస్తుంది

నీవు లేవని తెలియగానే
కాళ్ళు చేతులు ఆడక
గుండె లవిసిపోయేలా
కంటికి మింటికి ఏకధారగా
ఎంత ఏడిస్తే ఏం లాభం!
నీవు రాక

మా జీవితాలంతా అస్తవ్యస్తం అరాజకం
అగమ్యగోచరం అంధకార బంధురం
ఆరోగ్యం నశించి ఆనందం విస్మరించి
తనువులు కృశించి, జీవనాలు స్తంభించి
కన్నుల్లో ప్రాణాలుంచుకొని జీవచ్ఛవాల్లా
మిగిలాం

నీ వున్నప్పుడు వరాలుగా భాసించిన
జీవితాలే శాపాల్లా పరిణమించాయిపుడు
నీవున్నప్పుడు నిన్ననుసరించి అనుగ
మించినవారే
నేడు అవకాశవాదులై అధికారదండం
చెలాయిస్తున్నారు

ముసురుపట్టిన ప్రతి మనసులో
విషాదపు కారు మబ్బులు
కన్నీటి వాన — వరద
నీలాగ మమ్మల్ని శతకోటి
కన్నుల కిరణాలతో కాపాడేదెవరు
మారుమూల వారిని కూడ
మానవతతో తట్టి పలకరించే దెవరు?

రా! రవీ! రా!
గులకరాళ్ళు ఎన్నైతేనేం
ఒక్క మణి చాలు: ఒక్క దినమణి చాలు
రా ప్రభాకరా! మా జీవితాలను
చైతన్యప్లావితం చెయ్
నీవు లేక నీవు రాక
కాంతిలేని శాంతిలేని
ఈ చీకటి బ్రతుకులకు

వేకువలేక విసిగి వేసారి
కన్నీటి వాగులో పడిపోయిన
మమ్ముద్ధరించు
రా! మిత్రమా! రా!
నీ దుర్నిరీక్ష్య తేజస్సుతో
పలాయనం చిత్తగించాలి తమస్సులు
నీ చైతన్య కిరణాలతో
వికసించాలి మా జీవన కమలాలు
రా! సూర్యమా! రా!
లోకమంతా తన
కన్నుల కమలాలతో
ఎదురు చూస్తుంది నీకోసం
నీ ఉదయం కోసం.

—మందరపు హైమవతి

---

ఆ క్లార్కూ తనలాంటివాడే! క్యాష్‌లో రెండువందలు తక్కువయిందంటే.... పాపం!

ఇంటికి తిరిగి వచ్చేసరికి దాసు భార్యా వాసన్ భార్యా ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు.

"మీవారు లాభం లేదండీ!" అన్నాడు వాసన్ దాసు భార్యతో. "నేను పక్కన లేకపోతే బస్సుకూడా ఎక్కలేకపోయేవారు. నేనుండబట్టి బస్సు టిక్కెట్లలో ఆయనకి వన్ రుపీ మిగిల్చాను. అడగండి!" అన్నాడు చొరవగా నవ్వుతూ.

"ఆయనెప్పుడూ అంతే! అకటావికటం మనిషి! మొన్న శనివారంనాడు ఇడ్లీలు చేద్దామని పిండి తడిపిపెట్టి ఇడ్లీ రవ్వ తెమ్మని పంపిస్తే పరధ్యానంగా వెళ్ళిపోయి ఇడ్లీలే ప్యాక్ చేయించి తెచ్చేశారు. చచ్చిపోతున్నాం బాబూ!" అంది ఆమె కూడా సరదాగా నవ్వుతూ.

తనమీద పేలిన జోకులకి అందరికంటె పెదగా తనే నవ్వాడు దాసు.

ఆ రోజు తను చేసిన ఘనకార్యాలన్నీ వైనంగా, హాస్యంగా చెప్పిన తర్వాత వాసన్ తాము చూసిన సినిమా గురించీ అందులోని 'మెసేజ్' గురించీ వివరించడం మొదలెట్టాడు.

* * *

ఆరో తారీఖున.

"స్టేషనుదాకా రారూ?" అన్నాడు వాసన్. "రాక చస్తారా?" అన్నట్లుగా.

దాసూ, అతని భార్యా కూడా సెండాఫ్ ఇవ్వడానికి బయల్దేరారు.

రిక్షాలు మాట్లాడుకున్నారు ఎవరికి వాళ్ళు.

"స్టేషన్‌కా? మూడు రూపాయలు ఇవ్వండి సాబ్!" అన్నాడు రిక్షా అతను దాసుతో.

దాసుకి బేరమాడడం చేతకాదు. చిన్నప్పుడెప్పుడో బజారుకెళ్ళి వీశె మూడణాలకి అమ్ముతున్న వంకాయలు "నాలుగణాలకిస్తావా?" అని బేరంచేసి కొనుక్కొచ్చాడుట. అప్పటి నుంచీ బేరసారాల విషయంలో ఏమీ పురోభివృద్ధి సాధించ లేదు అతను. అందుచేత అస్పష్టంగా ఏదో గొణిగి, రిక్షా యెక్కేశాడు. వాసన్ అప్పటికే రిక్షా కుదిర్చేసుకుని, వెళ్ళిపోతున్నాడు.

స్టేషన్ దగ్గర దిగగానే హడావిడిగా పెట్టెలు పట్టుకుని లోపలికి వెళ్ళిపోయాడు వాసన్. రిక్షా డబ్బుల మాట అసలు గుర్తే లేనట్లు!

అతని రిక్షా డబ్బులు కూడా దాసే యివ్వాల్సివచ్చింది.

"ఎంత?" అని అడిగాడు, ఏ మూడున్నరో వుంటుందని అనుకుంటూ.

"రెండ్రూపాయలు సార్!" అన్నాడు రిక్షాఅతను.

వాసన్ ప్రయోజకత్వం మళ్ళీ రుజువయింది. తను రిక్షాకి మూడు రూపాయలు ఇవ్వగా అతను రెండు రూపాయలకే కుదుర్చుకున్నాడు. పైగా అతని రిక్షాలో ఇద్దరు పిల్లలూ, సామానూ ఎక్స్‌ట్రా!

డబ్బులు ఇస్తున్నప్పుడు చూశాడు దాసు రిక్షా అతని కుడికాలు దూలంలా పైనుంచి కిందిదాకా ఒకే లావుగా ఉంది! ఎడమ కాలు మాత్రం మామూలుగానే ఉంది

బోదకాలు!

అయినా బీదవాడు కావడంవల్ల కాయకష్టం చేయటం తప్పడం లేదు!

అంటే....అంటే....కుడికాలు తీపులు పెడుతూ గుంజేస్తూవుంటే.........దాదాపు ఒక్కకాలితోనే, ఎడం కాలితోనే తొక్కుతాడన్నమాట రిక్షా!

గుండె నీరయిపోయింది దాసుకి.

రెండు రూపాయలకి బదులు అతనికి కూడా మూడు రూపాయలు యిచ్చేశాడు

లోపలికెళ్ళగానే "అరె! నువ్వే యిచ్చేశావా డబ్బులు? ఎంత తీసుకున్నాడేమిటి?" అన్నాడు వాసన్.

"మూడు రూపాయలు."

'చూశావా! ఎంత చవటో!' అన్నట్లు క్రీగంట తన భార్యవైపు చూశాడు వాసన్.

"అదేమిటి! రెండు రూపాయలకే బేరం చేశారుకదా ఆయన! మూడు రూపాయలెందుకు యిచ్చారూ?" అంది వాసన్ భార్య- తన భర్తని గర్వంగా, దాసుని చులకనగా చూస్తూ.

దాసు మాట్లాడలేదు.

ఈలోపల రిజర్వేషన్ ఛార్టు దగ్గర చేరిపోయి, ఛడామడా చదివేస్తున్నాడు వాసన్.

అతని పేరు లేదు!

మళ్ళీ మళ్ళీ చదివాడు-కిందనుంచీ పైకీ, పైనుంచి కిందకీ!

ఉహూఁ! నిశ్చయంగా అతని పేరు లేదు!

నిప్పుతొక్కిన కోతిలా గెంతుతూ, కౌంటర్ దగ్గరికి పరిగెత్తాడు.

"నా పేరు లేదేమిటి?" అన్నాడు రంకెలేస్తూ.

క్లార్కు టిక్కెట్లు అందుకుని చూశాడు. ఆరో తారీఖు అనే వుంది వాటి మీద.

రిజిష్టర్ వెదికాడు.

టిక్కెట్లమీద ఆరో తారీఖని ఉండగా, రిజిష్టర్‌లో మాత్రం అయిదో తారీఖుకింద రాసిఉంది వాసన్ పేరు- అతనెక్కాల్సిన రైలు నిన్ననే వెళ్ళిపోయిందన్నమాట!

"ఎలా అయింది? ఎలా అవుతుందయ్యా ఇలాంటి పొరబాటు? ఒళ్ళు దగ్గర పెట్టుకుని పనిచెయ్యక్కర్లేదూ!" అంటున్నాడు వాసన్ కథాకళీ ఆడిపోతూ.

క్లార్కు జంకుతూ అతని మొహంలోకి చూశాడు. నుదురుచిట్లించాడు చటుక్కున లేచి రెండు చేతులూ కౌంటర్లోనుంచీ బయటికిపెట్టి వాసన్ కాలర్ పట్టుకున్నాడు.

"నువ్వేనా? పొరబాటు ఎలా అవుతుందంటావా? ఆ రోజు పొరబాటున నేనీకు రెండొందలు యిచ్చెయ్యలేదూ? అలగే! ఏం పెద్ద మనిషివయ్యా! డబ్బులు యెక్కువిస్తే తిరిగి యివ్వఖ్ఖర్లేదూ? ఏం తింటావ్ కడుపుకి? అన్నమా? గడ్డా?"

క్షణాల్లో పెద్దగుంపు పోగయింది ఇద్దరు పోర్టర్లు వచ్చి వాసన్‌ని జానపద చిత్రాల్లోలా బంధించి పట్టుకున్నారు. మొదట్లో బుకాయించినా, అతను రెండొందల చిల్లరా కక్కక తప్పలేదు. ఝూమ్మని రిజర్వుడు కంపార్ట్‌మెంటుల్లో ఎక్కాల్సినవాడు ఊపిరాడనంత మంది వున్న అన్ రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంటులో ఎక్కకా తప్పలేదు.


అతని మొహం మాడిపోయింది.

కాసేపాగి, "రిజర్వుడ్ కంపార్టుమెంటులో అయితే, దొంగలెక్కి బెదిరించే భయం జాస్తి! ఈ మందలోకి దొంగ రాలేడు. నన్నడిగితే ఇదే సేఫ్!" అన్నాడు సమర్ధించుకుంటూ

ఈ లోపల ఎవరో ముసలాయన సీటు మీద నుంచి లేచి బాత్‌రూం వైపువెళ్ళాడు.

వెంటనే ఆ స్థలంలో టవల్ పరిచి తన కొడుకుని పడుకోబెట్టేశాడు వాసన్.

ఆ ముసలాయన తిరిగి వచ్చాక జరిగిన వాగ్యుద్ధం, అప్పుడు వాసన్ చూపించిన ప్రయోజకత్వం. ఇవన్నీ చూసి మెచ్చుకోవడానికి దాసు అక్కడ లేదు.




ఉండాలనిపించలేదతనికి!

'వుంటాం' అని చెప్పి బయటికి వచ్చేశాడు తన భార్యతో సహా!

దుంగలాటి బోదకాలుతో వున్న అవిటి రిక్షా అతను, ఇంకా అక్కడే వున్నాడు. దాసుని గుర్తుపట్టి కష్టపడి లేచి నుంచున్నాడు. అతని మొహంలో కృతజ్ఞత! కపటంలేని నవ్వు! కొద్దిగా సంతోషం!

"రిక్షా కావాల్నా సార్?"

హఠాత్తుగా జ్ఞానోదయం అయినట్లయింది దాసుకి.

తన 'అప్రయోజకత్వం' వలన, తను "చేతకానితనంగా" ఒక రూపాయి యెక్కువ యివ్వడం వలన, సాటిమనిషి ఒకడు సంతోషిస్తున్నాడు!

తానీ అతి తెలివైన వాళ్ళయిన యింటి యజమాని రాఘవులూ, వాసన్‌ల ప్రయోజకత్వం వలన ఎన్ని కుటుంబాలకి మనస్తాపం, ఎంతమందికి చికాకులు, ఎంత అశాంతి!

తను అప్రయోజకుడు! మెతకవాడు! మొహమాటస్థుడు! నిజమే!

అయితే దానివలన ఎవరికీ కష్టం, నష్టం, అపకారం జరగలేదే! పైపెచ్చు సాధ్యమైనంతవరకూ ఎదుటి వాళ్ళని సంతోషపెట్టాలనే చూశాడు తను!

అసలు ప్రయోజకత్వానికి పరమావధి ఏమిటి? ఈ ప్రపంచంలోని విషాదాన్ని ఒక్క పిసరు తగ్గించకపోగా నాలుగింతలు ఎక్కువచేసే ప్రయోజకత్వం ఎందుకు?

లోకంలో తెలివైన వాళ్ళు చాలామందే వుండొచ్చు. వాళ్ళలో ఎక్కువమంది తెలివితేటలు 'పాజిటివ్'గా కాకుండా 'నెగెటివ్'గాఅందరి బాగుకోసం కాకుండా స్వార్థానికీ, పరపీడనకూ ఉపయోగించడం వల్ల ఎన్ని కలతలు! ఎంత కల్లోలం!

ఎందుకీ చదువులు? ఎందుకీ నాగరికత? ఏమిటీ పురోభివృద్ధి? అంతా పక్కవాణ్ణి నాశనం చెయ్యడం కోసమేనా?

ఈ లోకం ఆ రిక్షా అతని బోదకాలులా వుందేమో! లావుగా కనబడుతోంది అతని కుడికాలు. అది బలుపుకాదు వాపు. ఎంతో అభివృద్ధి సాధిస్తున్నట్లు భ్రమ కలిగిస్తూ, లోపల్లోపల కుళ్ళిపోతున్న ఈ నాగరికత లాగే వుందేమో!

ఇంత స్పష్టంగా, వివరంగా ఆలోచించలేదు దాసు. తను మాత్రం ఇలా "అప్రయోజకుడి"గానే వుండిపోదలుచుకున్నాడు. వాసన్‌లాగా ప్రయోజకుడవ్వాలన్న కోరిక అతనికి చచ్చిపోయింది.

రిక్షా అతను యెడం కాలితో బలంగా పెడలు తొక్కి ముందుకు పోనిస్తున్నాడు రిక్షాని.